# ఫెంగ్ షుయి



## పచ్చదనం భాగ్యానికి చిహ్నం

పచ్చదనం ఐశ్వర్యానికి చిహ్నం. ఆకుపచ్చ, పసుపు పచ్చ ఈ రెండు రంగులూ మంచివే. ఇంట్లో పచ్చని మొక్కలను పెంచుకుంటే మంచిది. పొద్దున్నే నిద్ర లేస్తూనే పచ్చటి చెట్టును చూస్తే ఆ రోజంతా మనసు ప్రశాంతంగా ఉంటుంది. చైతన్యంగా ఉంటుంది. ముఖ్యంగా జబ్బుతో బాధపడుతున్న వారు ఇంట్లో ఉన్నారంటే, వాళ్ల గదుల్లో పచ్చటి మొక్కలు ఏర్పాటు చేస్తే చక్కటి ఫలితం ఉంటుంది.

ప్రత్యేకించి నారింజ కానీ, నిమ్మ చెట్లను కానీ ఇళ్లవద్ద పెంచుకోవడం చాలామంచిది. మనం నారింజ, నిమ్మకాయలను వంటకాలకు, సౌందర్యానికి నిత్యం ఉపయోగిస్తుంటాం. అయితే ఈ చెట్ల వలన అంతకు మించిన ప్రయోజనం ఉంది. నారింజ, నిమ్మ పండ్లు బాగా పండినవి బంగారు రంగులో మెరుస్తుంటాయి. అందువలన వీటిని ఐశ్వర్యానికి గుర్తుగా భావిస్తారు. ఇలాంటి చెట్లు ఇంటి ఆవరణలో ఉండటం చాలా మంచిది. ఇంటికి ఆగ్నేయదిశ సంపదను సూచిస్తుంది. ఆ దిశలో నారింజ కానీ, నిమ్మ చెట్లను కానీ పెంచితే చాలా శుభం చేకూరుతుంది. ముఖ్యంగా ఈ దిశలో నారింజ చెట్లను పెంచుకోవాలి. ఈ చెట్లను ఇళ్లతోపాటు ఆఫీసుల వద్ద కూడా ఆగ్నేయ దిశలో పెంచితే మంచిది.

పల్లెలు, చిన్నచిన్న పట్టణాల్లో అయితే ఇళ్లవద్ద చెట్లను నాటుకోడానికి స్థలం ఉంటుంది. అదే నగరాలలో అయితే? నగరాల్లో స్వంత ఇల్లంటే అపార్ట్‌మెంట్లే. అపార్ట్‌మెంట్లలో కూడా నారింజ చెట్లను పెంచుకునే సదుపాయం ఉంది?! బొన్సాయ్ చెట్లను గురించి వినే వుంటారు. చాలా పెద్ద పెద్ద వృక్షాలు కూడా బొన్సాయ్ మొక్కల రూపంలో మనకు అందుబాటులో ఉంటున్నాయి. అపార్ట్‌మెంట్లలో ఉన్నవారు ఇంటికి ఆగ్నేయ దిశలో బొన్సాయ్ నారింజ మొక్కలను ఏర్పాటు చేసుకుంటే సకల శుభాలు కలుగుతాయి.

*

వారం వారం 'ఫెంగ్ షుయి' మీకోసం

# 'సరసి' కత

వైశంపాయనుడు హైదరాబాదులో ఉద్యోగంలో చేరిన కొత్తల్లో గవర్నమెంట్ ఉద్యోగుల కాలనీలో ఇల్లు తీసుకున్నాడు. మొదటి రోజు - ఆఫీసు స్పెషల్ బస్సు టైము కనుక్కొని బస్టాపుకి చేరుకున్నాడు. ''ఏయ్ కళ్లు కనబట్టం లేదా, తన్నుకుంటూ పోతున్నావ్'' అన్నారెవరో. కిందికి చూస్తే సూపర్‌బజార్‌లో అమ్మే వస్తువుల్లాంటివి ఒక పెన్ను, పెన్సిల్, దువ్వెన, కర్చీఫ్, చిన్న డైరీ, కీ చెయిన్, టిఫిన్‌బాక్సు, ఒక పేరు చెక్కిన నాపరాయి ముక్క, ఒక చిన్న చెట్టుకొమ్మ, కూల్ డ్రింక్ సీసా మూత - ఇవన్నీ నేలమీద వరసగా పెట్టి ఉన్నాయి చీమల బారులా. కాస్తంతా దూరంలో చెట్టుకింద నీడ పట్టున కూర్చుని వున్నారొక పదిహేను మంది దాకా. తనను హెచ్చరించింది వాళ్లే. వాళ్లంతా బస్సు కోసం లైన్లో ఎక్కువసేపు నిలబడలేక వాళ్ల తాలూకు వస్తువుల్ని ఇలా లైన్లో పెట్టి రిజర్వు చేసుకున్నారని తర్వాత తెలిసింది వైశంపాయనుడికి.

అసలీ సీటు రిజర్వేషన్లు జిల్లాల్లోనే పుట్టేయని వైశంపాయనుడి ప్రగాఢ విశ్వాసం. ఆ మధ్య ఓ సారి రాజమండ్రి నుంచి బెజవాడ వెళ్లే పాసింజర్ రైల్లో కూర్చున్నాడు తను. తాడేపల్లి గూడెంలో ప్లాట్‌ఫారం మీద విపరీతంగా వున్నారు జనం. రైలాగగానే ఒకాయనొచ్చి భుజం మీది తువ్వాలు తీసిచ్చాడు కిటికీ దగ్గర కూర్చున్న తనకి. వైశంపాయనుడు ఏదో ధ్యాసలో ''థేంక్స్''




## సీటెయ్యరా!

అంటూ, దానితో తన మొహానికి పట్టిన చెమట తుడుచుకున్నాడు. ''మీ చెవట తుడుచుకోడానిక్కాదు సార్ ఇచ్చిందీ, అదిగో ఆ సీట్లో వెయ్యండి'' అంటూ లోపలకి చూపించాడతడు. మరోవైపు కొందరు ''సీటెయ్‌రా, సీటెయ్'' అంటూ అరుస్తూ, కిటికీల్లోంచి చేతులు దూర్చి దూరంగా సీట్ల మీద పడేట్టు తువ్వాళ్ల వుండ చుట్టి ట్యాక్‌టిగ్గా విసిరేరు. మరో పక్క జనాలు తోసుకుంటూ లోపలికెక్కేశారు. ఎక్కినవాళ్లు హడావుడిగా దొరికిన చోటల్లా కూర్చుండిపోయారు కేరింతలు కొడుతూ. సీట్లన్నీ ఫిలప్పయిపోయాయి. చోటులేక చాలామంది నిలబడిపోయారు.

అయినా కిటికీల్లోంచి విసిరిన తువ్వాళ్ల నెవరూ ముట్టుకోవడం గాని, జరిపి కూర్చోడం గాని చెయ్యలేదు! కనీసం ఇదేవిటని క్వశ్చన్ కూడా చెయ్యలేదెవరూ! రైలు కదులుతూ వుంటే టవల్సు వేసిన వాళ్లు తాపీగా చుట్టలు కాల్చుకుంటూ ఎక్కి, తమ తువ్వాళ్లు తీసి, ఆ సీట్లల్లో దర్జాగా కూర్చున్నారు!

''వార్నీ! టవల్ రిజర్వేషన్స్‌కి ఇంత రెస్పెక్టా?'' ఆశ్చర్యం నించి ఓ పట్టాన తేరుకోలేకపోయాడు వైశంపాయనుడు! ఇలా టవల్సో, వస్తువులో వేసి సీట్లు రిజర్వు చేసుకునే పద్ధతికి వీళ్లే మార్గ దర్శకులని అప్పట్లో వూహించలేదతడు!

*